సాక్షి ప్రకాశం
శుక్రవారం । 29 । ఆగస్టు । 2025



సెంటు స్థలం కోసం ఇంత అరాచకమా స్వామీ?

సెంటు స్థలాన్ని స్వాధీనం చేసుకునేందుకు మంత్రి డోలా చేస్తున్న అరాచకాలపై మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ ధ్వజమెత్తారు. - 8లో..



విష సంస్కృతిని పెంచి పోషించొద్దు

వైఎస్సార్ సీపీ నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తూ కూటమి పాలకులు విష సంస్కృతిని పెంచి పోషించడం తగదని మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి హితవు పలికారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
31 /25

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

దండాలయ్యా.. ముత్యాల గణపయ్య



ఒంగోలు రంగుతోటలో నెమలి సెట్టింగ్‌లో ఊయలపై ముత్యాలతో చేసిన గణనాథుడు

వినాయకచవితి వేడుకలను జిల్లావ్యాప్తంగా అట్టహాసంగా నిర్వహిస్తున్నారు. వాడవాడలా గణపయ్య విగ్రహాలు ఏర్పాటు చేసి భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తున్నారు. పలు ప్రాంతాల్లో ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ప్రత్యేక సెట్టింగులలో భారీ విగ్రహాలు, వినూత్న ప్రతిమలు కొలువుదీరాయి.

- సాక్షి, ఒంగోలు

చరిత్రను తవ్వేస్తూ.. సంపద దోచేస్తూ..!

పశ్చిమ ప్రకాశం.. ఘనమైన చారిత్రక నేపథ్యం ఉన్న ప్రాంతం. కొత్తపి చాళుక్యులు..విజయనగర రాజులు.. కాకతీయ రాజులు..శాసనంపూడి వంశస్తులు పాలించిన నేల. పురావస్తుశాఖ అధికారుల పరిశోధనల్లో పలు శాసనాలు కూడా లభ్యమయ్యాయి. ఈ ప్రాంతంలో విలువైన సంపదను కొల్లగొట్టేందుకు అక్రమార్కులు తరచూ తవ్వకాలు జరుపుతూనే ఉన్నారు. అధికార పార్టీ నేతల అండదండలతో గుప్తనిధుల తవ్వకాల ముఠాల ఆగడాలకు అంతేలేకుండా పోతోంది. గంజివారిపల్లి రేంజ్ పరిధిలోని చెన్నుపల్లిగూడెం సమీపంలో ఏకంగా జేసీబీలతో తవ్వకాలు చేస్తూ సైలెన్సర్ బాంబులు పెట్టి పేల్చుతూ రెచ్చిపోతున్నారు. అటవీ, పోలీస్ శాఖ అధికారులు మొక్కుబడి చర్యలతో సరిపెడుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

- అధికార పార్టీ అండదండలతో నల్లమలలో రెచ్చిపోతున్న ముఠాలు
- జేసీబీలతో యథేచ్ఛగా తవ్వకాలు
- సైలెన్సర్ బాంబు పెట్టి పేల్చేందుకు యత్నం
- యర్రగొండపాలెం నియోజకవర్గం చెన్నుపల్లిగూడెం సమీపంలో ఘటన
- టీడీపీ కీలకనేత అనుచరుడిని అదుపులోకి తీసుకున్న అటవీశాఖ అధికారులు
- వ్యక్తిగత పూచీకత్తుపై వదిలేయడంతో స్థానికుల ఆగ్రహం
- ప్రభుత్వ ఉద్యోగుల పాత్రపై అనుమానాలు
- జేసీబీ, కమాండర్ జీపు స్వాధీనం



నల్లమల అడవిలో ఏర్పాటు చేసిన ఫారెస్టు చెక్‌పోస్టు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: పశ్చిమ ప్రకాశంలో మళ్లీ గుప్త నిధుల కోసం జోరుగా తవ్వకాలు జరుగుతున్నాయి. మార్కాపురం, యర్రగొండపాలెం, దర్శి, గిద్దలూరు, కనిగిరి ప్రాంతాల్లో గుప్త నిధుల కోసం తరచూ తవ్వకాలు జరుగుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ ముఠాలు ఇష్టారాజ్యంగా తవ్వకాలు జరుపుతున్నాయి. అధికార పార్టీ నేతల అండదండలు పుష్కలంగా ఉండటంతో అధికారులు సైతం చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. యర్రగొండపాలెం నియోజకవర్గం పరిధిలో అయితే ఫారెస్టు చెక్‌పోస్టు ఉన్నప్పటికీ పెద్ద జేసీబీలను సైతం తీసుకెళ్లి తవ్వకాలు చేస్తుండటం గమనార్హం.

విరుదుగుంటలో ఏం జరిగింది...

నల్లమల అటవీ ప్రాంతంలో విస్తరించి ఉన్న యర్రగొండపాలెం మండలంలో 20 కిలోమీటర్లు దాటిన తర్వాత దండకారణ్యం వస్తుంది. గాంధీనగర్ దాటిన తర్వాత అటవీ శాఖ అధికారులు చెక్ పోస్టు ఏర్పాటు చేశారు. ఎవరుపడితే వారు అటవీ ప్రాంతంలోకి వెళ్లకుండా నిత్యం పర్యవేక్షిస్తుంటారు. ప్రతి గురువారం నల్లమల అడవిలోని దద్దనాల ఆంజనేయస్వామికి పూజలు నిర్వహిస్తుంటారు. అక్కడకు వెళ్లే భక్తులను కూడా అటవీ శాఖ అధికారులు నానా ఇబ్బందులు పెడుతుంటారు. తరచూ భక్తులను అడ్డుకుంటుంటారు. అంతటి కట్టుదిట్టమైన రక్షణ ఉన్న అడవిలోకి కొందరు వ్యక్తులు ఏకంగా జేసీబీ తీసుకెళ్లి నిధుల తవ్వకాలు జరపడం చర్చనీయాంశంగా మారింది. ఫారెస్టు చెక్‌పోస్టుకు కూతవేటు దూరంలోనే తవ్వకాలు జరగడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గంజివారిపల్లి ఫారెస్టు రేంజ్ పరిధిలోని చెన్నుపల్లిగూడెం సమీపంలోని దద్దనాలదాపు సమీపం కోటగట్ల చెరువు పరిసర ప్రాంతాల్లో వీరయ్యస్వామి దేవాలయం ఉంది. ఈ ఆలయ పరిసరాలకు జేసీబీతో పాటుగా కమాండర్ వాహనంలో వెళ్లిన పలువురు వేటగాళ్లు గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపారు. పది అడుగుల మేర తవ్వకాలు జరపగా సిమెంటుతో నిర్మించిన పిల్లర్ బయటపడింది. దాన్ని సైలెన్సర్ బాంబులతో పేల్చడానికి ప్రయత్నించినట్లు తెలిసింది. తవ్వకాలకు ముందు ఆధునిక యంత్రాలతో స్కానింగ్ నిర్వహించినట్లు సమాచారం. మూడు రోజుల పాటు రాత్రివేళల్లో తవ్వకాలు సాగించినట్లు విశ్వసనీయవర్గాల సమాచారం.

అటవీశాఖ అదుపులో టీడీపీ నాయకుడు.?

మూడు రోజుల తర్వాత గుప్తనిధుల తవ్వకాలు జరుపుతున్న విషయాన్ని పసిగట్టిన అటవీశాఖ అధికారులు తీరిగ్గా రంగప్రవేశం చేశారు. టీడీపీ కీలక నేత ముఖ్య అనుచరుడిని, యర్రగొండపాలేనికి చెందిన జేసీబీ వాహనం యజమానిని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కమాండర్ వాహనానికి సంబంధించిన వ్యక్తులు పరారైనట్లు అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. వీరికి అధికార పార్టీ నేతల అండదండలు ఉండడంతో ఎలాంటి కేసు నమోదు చేయకుండా తప్పించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మిగిలిన వారిని సైతం పూర్తిగా విచారించకుండానే పూచీకత్తుపై విడుదల చేశారని తెలుస్తోంది.

గుట్టల చేనులో నిధి దొరికిందా.?

ఆరు నెలల కిందట పాలుట్ల సమీపంలోని గుట్టల చేనులో ఒక వ్యక్తికి నిధి దొరికినట్లు ప్రచారం జరుగుతోంది. స్థానికంగా ఉండే ఒక గిరిజన యువకుడికి బంగారు నాణేలు దొరికినట్టు తెలుస్తోంది. దానిపై యర్రగొండపాలెంలోని ఒక గొర్రెల వ్యాపారికి సమాచారం ఇచ్చినట్లు చెప్పుకుంటున్నారు. పోలీసులతో కుమ్మక్కైన సదరు గొర్రెల వ్యాపారి నమ్మకంగా గిరిజన యువకుడిని పిలిపించి పోలీసులకు అప్పగించినట్లు సమాచారం. అతడితో పాటు మరొకరిని కూడా అదుపులోకి తీసుకున్న పోలీసులు.. అతడిని రెండు రోజుల పాటు విచారించినట్లు తెలిసింది. ఆ తర్వాత అతడి వద్ద ఉన్న బంగారు నాణేలు ఏమయ్యాయో తెలియడంలేదని గుసగుసలాడుకుంటున్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల పాత్రపైనా అనుమానాలు...

నిధుల తవ్వకాలలో ప్రభుత్వ ఉద్యోగుల హస్తమున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. టీడీపీకి చెందిన ఒక సర్పంచ్, ఒక ప్రభుత్వ పాఠశాల టీచర్, ఒక వివాదాస్పద గ్రామ కార్యదర్శి పాత్ర ఉన్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. తవ్వకాలలో సిమెంటు పిల్లర్ కనిపించగానే టీడీపీ కీలక నేతకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చినట్లు చెప్పుకుంటున్నారు. అలాగే పశ్చిమ ప్రకాశానికి చెందిన ఒక ఎమ్మెల్యే అనుచరులు కూడా ఈ తవ్వకాలలో ఉన్నారని విశ్వసనీయ సమాచారం. అయితే, అటవీ శాఖ అధికారులు స్వాధీనంలో ఉన్న జేసీబీకి టీడీపీ నేత అనుచరుడు రూ.15 వేలకు డీజిల్ కొట్టించి ఫోన్ పే చేసినట్లు అధికారులకు సాక్ష్యాలు లభించాయని ప్రచారం జరుగుతోంది. ఈ తవ్వకాల్లో అటవీశాఖ ఉద్యోగుల పాత్రపై కూడా అనుమానాలున్నాయి. చెక్‌పోస్టు వద్ద కాపలా కాయాల్సిన ఉద్యోగుల సహకారంతోనే వేటగాళ్లు అడవిలోకి ప్రవేశించినట్లు సమాచారం. లేకపోతే జేసీబీ లాంటి పెద్ద వాహనం వెళ్లగలిగేది కాదని, మూడు రోజుల పాటు జేసీబీ, కమాండర్ వాహనాలు లోపలే ఉన్నప్పటికీ ఉన్నతాధికారులు ఏం చేస్తున్నారన్న ప్రశ్నకు కూడా సమాధానం లేదు.

పాలకుల మొద్దు నిద్ర...

నల్లమల అడవుల్లో తరచూ నిధుల తవ్వకాలు జరుగుతున్నప్పటికీ పాలకులు మొద్దునిద్ర నటిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నాలుగేళ్ల క్రితం కూడా చెన్నుపల్లిగూడెం వద్ద నిధుల కోసం తవ్వకాలు జరిగాయి. అప్పుడు 11 మందిని అరెస్టు చేశారు. అప్పటి నుంచి మౌనంగా ఉన్న వేటగాళ్లు ఇప్పుడు అధికార పార్టీ అండదండలతో రంగప్రవేశం చేసినట్లు అధికారులు చెబుతున్నారు. టీడీపీ కీలకనేత అనుచరుడు ఈ ఘటనలో పట్టుబడటం ఇందుకు నిదర్శనంగా చెప్పవచ్చు. నిధుల కోసం విలువైన శాసనాలను, పురాతన దేవాలయాలను ధ్వంసం చేయడం సరికాదని చరిత్రకారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ఫారెస్టు అధికారులు స్వాధీనం చేసుకున్న జేసీబీ, కమాండర్ వాహనాలు

నిధుల కోసమే తవ్వకాలు

కోటగట్ల చెరువు సమీపంలో నిధుల కోసం తవ్వకాలు జరిపినట్లు నిందితులు అంగీకరించారు. అయితే, వారికి ఎలాంటి నిధి దొరకలేదు. చెక్‌పోస్టులో సిబ్బంది లేని సమయంలో అడవిలోకి ప్రవేశించారు. వారు లోపలకు వెళ్లిన సమాచారం తెలిసిన వెంటనే వెళ్లి నిందితులను అదుపులోకి తీసుకున్నాం. ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు తదుపరి చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం విచారణ జరుపుతున్నాం.

– ప్రసన్న జ్యోతి, ఫారెస్టు రేంజ్ ఆఫీసర్

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీలో ఇద్దరికి రాష్ట్రస్థాయి పదవులు

ఒంగోలు సిటీ: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాకు చెందిన ఇద్దరు నాయకులకు ఆ పార్టీలో రాష్ట్ర స్థాయి పదవులిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. పార్టీ రైతు విభాగం రాష్ట్ర జనరల్ సెక్రటరీగా గిద్దలూరు నియోజకవర్గానికి చెందిన సూరస్వామి రంగారెడ్డిని, రాష్ట్ర ఎస్సీ సెల్ అఫీషియల్ స్పోక్స్‌పర్సన్‌గా మార్కాపురం నియోజకవర్గానికి చెందిన మురారి వెంకటేశ్వర్లును నియమించినట్లు పార్టీ కార్యాలయం తెలిపింది.

పులి కాదు.. పిల్లి కూన.!



కొమరోలు: మండలంలోని హసనాపురం గ్రామంలో చిరుతపులి పిల్లను పోలి ఉన్న ఓ పిల్లి పిల్ల హల్‌చల్ చేసింది. చూడటానికి విచిత్రంగా ఉండటంతో పాటు తీవ్రగాయాలతో ఉండగా స్థానికులు పట్టుకుని స్థానిక పోలీసులు, ఫారెస్టు అధికారులకు సమాచారం అందించారు. కొమరోలు ఎస్సై ఎ.నాగరాజు, అటవీశాఖ సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మొదట చిరుతపులి పిల్లగా భావించారు. దానిని స్వాధీనం చేసుకుని గిద్దలూరులోని పశుసంవర్థకశాఖ వైద్యాధికారి వద్దకు తీసుకెళ్లి పరిశీలించారు. అది జంగిల్ క్యాట్‌గా వైద్యాధికారి నిర్ధారించారు. గాయపడి ఉండటంతో చికిత్స చేశారు. కోలుకోగానే అటవీ ప్రాంతంలో వదిలిపెడతామని ఫారెస్ట్ సిబ్బంది తెలపగా, కోలుకునేంత వరకు తమ సంరక్షణలో ఉంటుందని వైద్యులు తెలిపారు.

దర్గా గ్రామ సమీపంలో పులి

- పాదముద్రలు గుర్తించి గాలిస్తున్న ఫారెస్ట్ అధికారులు



కంభం: మండలంలోని దర్గా గ్రామ సమీపంలోని కొండ వద్ద పులి పాదముద్రలు కనిపించడంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ఇటీవల అర్థవీడు మండలంలోని అటవీ ప్రాంతంలో పశువులపై పులి దాడి చేసి చంపేసిన ఘటనల నేపథ్యంలో కంభం మండలంలో పలు చోట్ల పులి సంచరిస్తున్నట్లు అనుమానిస్తున్నారు. ఈ క్రమంలో దర్గా గ్రామానికి సమీపంలోనే పులి పాదముద్రలను గుర్తించి అటవీ శాఖాధికారులకు సమాచారం అందించడంతో గురువారం గిద్దలూరు డీఎఫ్ఓ నిషాకుమారి, తురిమెళ్ల, బేస్తవారిపేట, గిద్దలూరు ఎఫ్ఆర్వోలు మధుప్రియ, ఆనందరావు, సత్యనారాయణ, వారి సిబ్బంది వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎఫ్ఓ నిషాకుమారి మాట్లాడుతూ ప్రజలెవరూ భయపడాల్సిన అవసరం లేదన్నారు. ఫారెస్టు అధికారులు గాలిస్తున్నారని, పులి జాడ తెలిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని సూచించారు. సమీపంలో ఉన్న జేబీకే పురం ఫారెస్ట్ పరిసరాల్లో నుంచి పులి వచ్చి ఉంటుందని అనుమానిస్తున్నారు. ఫారెస్ట్ అధికారులు సమీపంలో ఉన్న కంభం, బేస్తవారిపేట మండలాల్లోని గ్రామాల్లో తిరిగి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. పరిసరాల్లో ట్రాప్ కెమెరాలు బిగించి పులి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

మోసం చేయడంలో చంద్రబాబు దిట్ట

- మాజీ మంత్రి మేరుగు నాగార్జున



రాచవారిపాలెంలో క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి మేరుగు నాగార్జున, నాయకులు

మద్దిపాడు: ప్రజలను మోసం చేయడంలో చంద్రబాబు దిట్ట అని, ప్రతి ఎన్నికలకు ప్రజలకు ఎన్నో రకాల హామీలివ్వడం.. అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయకుండా మోసగించడం ఆయనకు అలవాటైపోయిందని వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. మద్దిపాడు మండలంలోని మల్లవరంలో గురువారం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించారు. అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నా ఎన్నికల హామీలు అమలు చేయకుండా ప్రజలను నయవంచన చేస్తున్నారని ధ్వజమెత్తారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అధికారంలోకి వచ్చిన ఏడాదికే అన్ని హామీలు అమలు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అన్ని వర్గాలకు మేలు చేస్తూ ఆనాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేశారని వివరించారు. ఇప్పుడు మాత్రం అరకొరగా అందిస్తున్న పథకాలు కూడా అర్హులందరికీ కాకుండా కూటమి పార్టీలకు నచ్చిన వారికే ఆయా పార్టీల నాయకుల జోక్యంతో అందిస్తున్నారని దుయ్యబట్టారు. ఉచిత గ్యాస్, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఉచిత బస్సు పథకాల్లో ఎంతోమంది అర్హులకు అన్యాయం జరిగిందని మేరుగు నాగార్జున మండిపడ్డారు. అనంతరం వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి క్యూఆర్ కోడ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో మద్దిపాడు ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, గ్రామ సర్పంచ్ నారా సుబ్బారెడ్డి, తెల్లబాడు ఎంపీటీసీ పద్మావతి, పార్టీ మల్లవరం గ్రామ అధ్యక్షుడు నరహరి చెంచురెడ్డి, పళ్లపాటి అన్వేష్, తేళ్ల పుల్లారావు, రాయపాటి విల్సన్, నాదెండ్ల మహేష్, సన్నపరెడ్డి రవణమ్మ, నల్లూరి రాంబాబు, అద్దంకి శ్రీకాంత్, మర్రిపూడి హనుమంతరావు, మర్రిపూడి గంగయ్య, ఈమని బ్రహ్మయ్య, వంకాయలపాటి వీరనారాయణ, పఠాన్ కరిముల్లా, ఏకాంబరం నారాయణ, ముద్రగడ అంజయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాచవారిపాలెంలో...

మద్దిపాడు మండలం రాచవారిపాలెం గ్రామంలోనూ గురువారం బాబు షూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. మాజీ మంత్రి మేరుగు నాగార్జున ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను గుర్తు చేసే విధంగా రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో క్యూఆర్ కోడ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో మద్దిపాడు ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, వైస్ ఎంపీపీ పైడిపాటి వెంకట్రావు, పార్టీ గ్రామ అధ్యక్షుడు, మద్దిపాడు మండల సెక్రటరీ పిట్టల ఆంజనేయులు, రాచవారిపాలెం గ్రామ సర్పంచ్ పరాలశెట్టి నాగమల్లేశ్వరి, పురాణశెట్టి వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

బియ్యం అక్రమ రవాణాదారులపై కేసులు

సాక్షి ఎఫెక్ట్..

మార్కాపురం: బియ్యం అక్రమ రవాణాదారులపై కేసులు నమోదు చేస్తున్నట్లు జిల్లా పౌరసరఫరాల అధికారి ఎస్.పద్మశ్రీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26వ తేదీ సాక్షి దినపత్రికలో 'గ్రామగ్రామాన ఏజెంట్లు, బియ్యం సిండికేట్లు' శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. బియ్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు పౌరసరఫరాల శాఖ క్షేత్రస్థాయి సిబ్బంది, ఇతర అనుబంధ శాఖలతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ ఉమ్మడి తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. బియ్యం అక్రమ రవాణా చేస్తున్న వారిపై 6ఏ కేసులు నమోదు చేస్తున్నామన్నారు. బేస్తవారిపేట తహసీల్దార్, ఎన్‌ఫోర్సుమెంటు డిప్యూటీ తహసీల్దార్లు, మార్కాపురం, పొదిలి ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు ఈ ఏడాది జనవరి నుంచి ఆగస్టు 26వ తేదీ వరకూ బియ్యం అక్రమ రవాణా చేస్తున్న 41 రేషన్ షాపులపై 6ఏ కేసులు, అక్రమ రవాణాపై 7 కేసులు, అక్రమ నిల్వలపై 6 కేసులు, 5 క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. 1956.04 క్వింటాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని 6ఏ కేసులు 53 నమోదు చేసినట్లు చెప్పారు. రాత్రివేళ ప్రత్యేక నిఘా పెట్టి బియ్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రతి నెలా ప్రత్యేక తనిఖీల దినోత్సవం ద్వారా వివిధ శాఖల సమన్వయంతో తనిఖీలు చేస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకూ కార్డుదారుల నుంచి కొనుగోలు చేసిన బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తున్న 74 రేషన్ షాపులపై 6ఏ కేసులు, అక్రమ రవాణాపై 15 కేసులు, అక్రమ నిల్వలపై 12 కేసులు, 10 క్రిమినల్ కేసులు నమోదు చేశామన్నారు. అదే విధంగా 4492.47 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని 6ఏ కేసులు 102 నమోదు చేసినట్లు పద్మశ్రీ తెలిపారు.

పరిశీలన పూర్తయింది.. ఇక వెళ్లొచ్చు..!



సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరైన అభ్యర్థులు

ఒంగోలు సిటీ: డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులకు సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. నగరంలోని చెరువుకొమ్ముపాలెంలో సరస్వతీ జూనియర్ కాలేజీలో పరిశీలన జరుగుతోంది. జిల్లా వ్యాప్తంగా వివిధ కేటగిరీల కింద 568 మంది అభ్యర్థులు వెరిఫికేషన్‌కు వచ్చారు. రాత్రి 9 గంటలకు 400 మందికిపైగా అభ్యర్థుల వెరిఫికేషన్ పూర్తి చేశారు. 12 బృందాలతో వెరిఫికేషన్ ప్రక్రియ జరుగుతోంది. అయితే, సర్టిఫికెట్లు పరిశీలించినట్టు చెక్‌లిస్ట్ కాపీ ఇవ్వమని అడగ్గా 'మీ సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయింది.. ఇక మీరు వెళ్లవచ్చు' అని చెబుతున్నారు. దీనిపై అభ్యర్థులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. మిగతా జిల్లాల్లో ఇస్తున్నారు కదా.. ఇక్కడెందుకు ఇవ్వరని పలువురు అభ్యర్థులు అధికారులను నిలదీశారు. డీఈఓ ఇవ్వొద్దని చెప్పారని వారు సమాధానమివ్వగా, మిగతా జిల్లాల్లో ఇస్తున్న కాపీలను డీఈఓకు అభ్యర్థులు చూపించారు. కొందరు ఆర్జేడీకి ఫోన్ చేశారు. అయితే, ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాలు అమలు చేస్తున్నామని ఆయన సమాధానమివ్వగా, మిగతా జిల్లాల్లో ఇస్తుండగా.. ఇక్కడ అభ్యంతరం ఏమిటని అడగడంతో ఆర్జేడీ ఫోన్ కట్ చేశారని పలువురు అభ్యర్థులు తెలిపారు. రాష్ట్రమంతా ఒక రూలు.. ఇక్కడ మరో రూలా అంటూ వారు మండిపడుతున్నారు. కనీసం మెగా డీఎస్సీ లాగిన్‌లో అయినా సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయినట్లు మెసేజ్ వస్తే బాగుంటుందని అభ్యర్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

నల్లమలలో భారీ వర్షం



కల్వర్టు కొట్టుకుపోవడంతో స్తంభాలపై రాకపోకలు సాగిస్తున్న ప్రజలు

పెద్దదోర్నాల: నల్లమల అభయారణ్యంలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పెద్దదోర్నాల మండల పరిధిలో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. వరద నీటితో పలు వాగులు పొంగి ప్రవహిస్తుండటంతో మండల పరిధిలోని గంటవానిపల్లె గ్రామం జల దిగ్బంధంలో చిక్కుకుంది. తీగలేరు, రాళ్లవాగులు పొంగడంతో గంటవానిపల్లె పూర్తిస్థాయిలో జలదిగ్బంధంలో చిక్కుకుంది. గ్రామస్తులు బయటకు రాలేక అవస్థపడుతున్నారు. గతంలో గ్రామానికి సంబంధించిన లో లెవల్ కల్వర్టుకు పూర్తి స్థాయిలో మరమ్మతులు నిర్వహించారు. అయితే, గురువారం వరద నీటి ఉధృతికి కల్వర్టుకు నిర్వహించిన మరమ్మతులు పూర్తి స్థాయిలో కొట్టుకుపోయాయి. దీంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వరద నీటి ఉధృతి తగ్గిన సమయంలో విద్యుత్ స్తంభాల సహాయంతో వాగు దాటుతున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్సై మహేష్ తీగలేరు వద్ద భద్రతా చర్యలు చేపట్టారు. నల్లమలలో కురిసిన భారీ వర్షాలకు రాళ్లవాగు పొంగి ప్రవహిస్తుండటంతో పెద్దబొమ్మలాపురానికి చెందిన గండి చెరువుకు భారీగా వరద నీరు చేరుతోంది. చెరువు నీటి మట్టం 19 అడుగుల కాగా, ప్రస్తుతం 17 అడుగుల మేరకు నీరు చేరడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలుగును మరో రెండు అడుగుల ఎత్తుకు నిర్మిస్తే రైతులకు మేలు జరుగుతుందని కోరుతున్నారు.

క్లుప్తంగా

నీట మునిగిన ఎరువుల గోడౌన్

● రూ.2 లక్షల మేర నష్టం



గోడౌన్‌లో నీట మునిగిన యూరియా బస్తాలు

పెద్దదోర్నాల: మండల పరిధిలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. బుధవారం రాత్రి కురిసిన కుండపోత వర్షానికి మండల కేంద్రంలోని కర్నూలు రోడ్డులో గాలి వీరారెడ్డికి చెందిన కాంప్లెక్స్ ఎరువుల గోడౌన్ నీట మునిగింది. అండర్ గ్రౌండ్‌లోకి మూడు అడుగుల మేర నీరు చేరడంతో సుమారు వంద బస్తాల కాంప్లెక్స్ ఎరువులు నీట మునిగాయి. ఎరువుల దుకాణం యజమాని గాలి వీరారెడ్డి భార్య ఒంగోలులో మృతి చెందడంతో ఆయన ఆస్పత్రిలో ఉన్నారు. అదే సమయంలో భారీ వర్షానికి ఎరువులు నీట మునిగాయి. యూరియా గోడౌన్‌లోకి నీరు చేరాయని ఆలస్యంగా గుర్తించిన స్థానికులు విద్యుత్ మోటార్ల సాయంతో నీటిని తోడిపోసేందుకు ఉపక్రమించారు.

వృద్ధురాలి హత్య కేసులో నిందితులు అరెస్టు

సింగరాయకొండ: సింగరాయకొండలో ఈనెల 23వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో వృద్ధ మహిళ చెరుకూరు సుబ్బాయమ్మ హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ హత్య కేసును సవాలుగా తీసుకున్న పోలీసులు గురువారం కేసును ఛేదించారు. కేసు వివరాలను స్థానిక పోలీస్ స్టేషన్లో సీఐ హజారత్తయ్య విలేకరులకు వెల్లడించారు. చెరుకూరి సుబ్బాయమ్మతో నత్తల మమత, నత్తల మణికంఠ, మధుమాల మాధురి సన్నిహితంగా ఉండేవారు. సుబ్బాయమ్మతో డబ్బు విషయంలో తేడా రావడంతో బెల్లం పాయసంలో మత్తు బిళ్లలు ఎక్కువ మోతాదులో కలిపి ఇచ్చారు. మత్తులో ఉన్న సుబ్బాయమ్మను మంచంపై నెట్టి ముఖంపై దిండుతో నొక్కి ఊపిరాడకుండా చేసి చంపారు. నిందితులను నుంచి బంగారు తాళిబొట్టు, ఒక జత కమ్మలు, ఒక జత బంగారు చెంపచవరాలు, రూ.960 నగదు, ఏటీఎం కార్డు, ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు సీఐ చెప్పారు. సమావేశంలో ఎస్సై బి.మహేంద్ర, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామోత్సవంలో ఆకతాయిల హల్‌చల్



ప్రార్థనా మందిరం వద్ద ఆకతాయిలు వదిలిన పొగ

కంభం: కంభం పట్టణంలో గురువారం గణేష్ నిమజ్జన గ్రామోత్సవంలో కొందరు ఆకతాయిలు హల్‌చల్ చేశారు. మార్గమధ్యంలో ఓ ప్రార్థనా మందిరం వద్ద కలర్ ఎక్స్‌టింగ్విషర్‌తో రంగు పొగ వదలడంతో ఆ పరిసరాల్లో ఉన్న భక్తులతోపాటు ఇతరులు, పోలీసులు ఇబ్బంది పడ్డారు. పోలీసులు అతని చేతిలో ఉన్న సిలిండర్ లాక్కుని పంపించే యత్నం చేయగా ఉద్రిక్తత నెలకొంది. అంతకుముందు వెళ్లిన కొందరు యువకులు సైతం అదే ప్రార్థన మందిరం వద్ద హంగామా చేయడంతోపాటు పోలీసులతోనే వాగ్వివాదానికి దిగడం గమనార్హం. ఇదిలా ఉండగా చెరువు కట్ట మార్గంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చీకటి పడకముందే విగ్రహాలను నిమజ్జనానికి తరలించేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

దుకాణంలో రూ.90 వేలు చోరీ



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని గుంటూరు రోడ్డులో ఓ ఇనుప సామగ్రి దుకాణంలో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. మంగళవారం రాత్రి దొంగలు రూ.90 వేలు దోచుకెళ్లినట్లు దుకాణ యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలాన్ని క్లూస్ టీం పరిశీలించి, వేలిముద్రలు సేకరించింది. ఎస్సై మహేష్ కేసు దర్యాప్తు చేపట్టారు.

సెంటు స్థలం కోసం ఇంత అరాచకమా స్వామీ?

- హైకోర్టులో సివిల్ వివాదంలో ఉన్న స్థలంలోకి పోలీసులను పంపడమేంటి?
- చెల్లెలి వరసయ్యే వారితో అన్నలపై లైంగిక దాడి కేసులు పెట్టించడం నీచం
- మహిళలను సీఐ బూతులు తిట్టి, లాఠీ చార్జి చేసి, తుపాకీతో బెదిరించడం దారుణం
- నెల రోజుల్లో 26 మందిపై అక్రమ కేసులు పెట్టడం అరాచక పాలనకు నిదర్శనం
- విలేకరుల సమావేశంలో వైఎస్సార్ సీపీ కొండపి ఇన్‌చార్జి ఆదిమూలపు సురేష్ ధ్వజం
- జాళ్లపాలెంలో పోలీసుల దాడిలో గాయపడిన మహిళలు, రైతులకు పరామర్శ
- గోడు వెళ్లబోసుకున్న బాధితులు.. అండగా నిలుస్తామని మాజీ మంత్రి భరోసా

కొండపి: కోర్టులో సివిల్ వివాదంలో ఉన్న సెంటు స్థలం స్వాధీనం చేసుకునేందుకు మీకు ఊడిగం చేస్తున్న పోలీసులను ఉసిగొల్పడమే కాకుండా, మహిళలపై లాఠీ చార్జి చేయించి, బండ బూతులు తిట్టిస్తావా? ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుతో కలిపి మొత్తం మూడు కేసులు బనాయిస్తావా? నీకు ఇదేం రాక్షసానందం స్వామీ? అంటూ మంత్రి డీబీవీ స్వామిపై వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి, పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కొండపి మండలంలోని జాళ్లపాలెం గ్రామంలో గురువారం సాయంత్రం పోలీసుల దాడిలో గాయపడిన వైఎస్సార్ సీపీ సానుభూతిపరులను ఆయన పరామర్శించారు. పోలీసులు దగ్గరుండి ధ్వంసం చేసిన రచ్చబండ స్థలాన్ని పరిశీలించి అక్కడే విలేకరుల సమావేశం నిర్వహించారు. మాజీ మంత్రి సురేష్ మాట్లాడుతూ.. "జాళ్లపాలెం రెవెన్యూ సర్వే నంబర్ 627లో 20 మందికి చెందిన 50 సెంట్ల స్థలం విషయమై హైకోర్టులో సివిల్ కేసు నడుస్తోంది. అయితే రచ్చ బండ ఉన్న భాగం తనకు చెందిన సెంటు స్థలమని టీడీపీ సానుభూతిపరుడు చెప్పగానే రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి స్వామి పోలీసులను గ్రామంపైకి ఉసిగొల్పడం దుర్మార్గమన్నారు. కోర్టు కేసు కారణంగా రెవెన్యూ అధికారులు జోక్యం చేసుకోకపోయినా, సీఐ సోమశేఖర్ అత్యుత్సాహం ప్రదర్శించి ప్రశాంతంగా ఉండే గ్రామంలో అరాచకం సృష్టించడాన్ని తప్పుబట్టారు. జూలై నెలలో ఆరంభమైన స్థల వివాదంలో ఇప్పటి వరకు రెండు సాధారణ కేసులు, ఒక ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుతో పాటు 23 మందిపై వివిధ రకాల కేసులు బనాయించడం అరాచక పాలనకు నిదర్శనమని నిప్పులు చెరిగారు.

మహిళలేమైనా నక్సలైట్లా?

మహిళలపై పోలీసులు, ముఖ్యంగా మర్రిపూడి ఎస్సై రమేష్ బాబు లాఠీ చార్జి చేయడంతోపాటు బూతులు తిట్టడం దారుణమన్నారు. వృద్ధురాలు అనే కనికరం కూడా లేకుండా లాఠీలతో కొట్టి, బూటు కాళ్లతో తన్నడం మంత్రి మెప్పు కోసమేనా అని పోలీసులను నిలదీశారు. "పచ్చని చెట్టు తొలగించొద్దు, రచ్చబండను ధ్వంసం చేయవద్దు అని కోరిన మహిళలపై తుపాకీ గురిపెట్టి, బూతులు తిడతారా. వీరేమైనా మావోయిస్టులా?" అని సీఐ సోమశేఖర్‌ను ప్రశ్నించారు.

అన్నలపై చెల్లితో లైంగికదాడి కేసులు పెట్టిస్తారా?

ఈనెల 26వ తేదీ రాత్రి రచ్చబండ ధ్వంసం, వేప చెట్టు తొలగించిన ఘటనలో టీడీపీ సానుభూతిపరురాలు ఎదురు పుష్పాలుతో అన్నలైన ఎరిగల కోటేశ్వరరెడ్డి, భూమా శ్రీనురెడ్డి, భూమా పుల్లారెడ్డిపై లైంగికదాడికి యత్నించిన కేసు పెట్టించారంటే ఇంతకన్నా దారుణం ఇంకేమైనా ఉందా అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనలో గాయపడిన బాధితులు చికిత్స కోసం ఒంగోలు జీజీహెచ్‌కు వెళితే ఓపీ, మందుల చీటీ కూడా ఇవ్వకుండా వేకువజామున 3 గంటల సమయంలో డాక్టర్ ఇంజక్షన్ చేసి వెళ్లిపోవాలని బండి లీలాప్రియను బెదిరించడం, అక్కడి ఎస్సై, ఏఎస్సైలు మీరు పోలీసులపై ఫిర్యాదు చేస్తే మేము ఎలా కేసు నమోదు చేస్తామని చెప్పడం దేనికి సంకేతమన్నారు. ఎవరి స్థలం ఎక్కడుందో తేలకముందే, టీడీపీ సానుభూతిపరుడికి అండగా ఒక సీఐ, ముగ్గురు ఎస్సైలు, సుమారు 40 మంది పోలీసులు వచ్చి గ్రామంలో దాష్టీకానికి తెగబడటాన్ని ఆక్షేపించారు. తెల్లవారితే వినాయక చవితి పండగ, గ్రామంలో పాము కాటుతో మహిళ చనిపోయి దుఃఖంలో ఉంటే పోలీసులు హింసకు పాల్పడటం హేయమైన చర్య అని అన్నారు.

ఎస్పీ స్వయంగా విచారణ జరపాలి

కొండపి సర్కిల్ పోలీసులు సృష్టించిన ఈ హింసా కాండపై ఎస్పీ ఏఆర్ దామోదర్ స్వయంగా గ్రామ సభ నిర్వహించి విచారణ జరిపి దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధితులకు న్యాయం చేసేందుకు డీజీపీ చర్యలు తీసుకోవాలన్నారు. తమ అరాచకాలు ఎక్కడ బయటపడతాయోనని సీసీ కెమెరాను పోలీసులు ధ్వంసం చేశారని, దీనిని బట్టి పోలీసులు ఎంత అరాచకం సృష్టించారో అర్థమవుతుందన్నారు. విలేకరుల సమావేశంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కోటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు డాకా పిచ్చిరెడ్డి, సర్పంచ్ భువనగిరి సత్యన్నారాయణ, సీనియర్ నాయకులు మండవ మాల కొండయ్య, వేముల రమేష్, వసంతరావు, వెంకటేశ్వరరెడ్డి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



రచ్చబండ తొలగించిన ప్రదేశం వద్ద బాధితులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి సురేష్



పోలీసుల లాఠీచార్జీలో గాయపడిన ఎరగల కోటేశ్వరరావు

మర్రిపూడి ఎస్సై దౌర్జన్యం చేశాడు



మంగళవారం రాత్రి 7:30 గంటల సమయంలో పాలు పోయించుకోవడానికి బజారుకు వచ్చా. రచ్చబండతోపాటు 30 ఏళ్ల నుంచి ఉన్న చెట్టును పోలీసుల సమక్షంలో జేసీబీతో కూలుస్తున్నారు. ఇదేమని ప్రశ్నించగానే మర్రిపూడి ఎస్సై రమేష్‌బాబు మీదిమీదికొస్తూ "ఎవతివే నువ్వు అడగడానికి" అని నోటికొచ్చినట్లు తిట్టాడు. అయినా గట్టిగా నిలదీయడంతో లాఠీతో కొట్టాడు. 108 అంబులెన్స్‌లో ఎక్కకుండా మమ్మల్ని పోలీసులు అడ్డుకున్నారు. చివరకు చేలల్లో నడుస్తూ మెయిన్ రోడ్డుకు చేరుకుని ఒంగోలు రిమ్స్‌కు పోయాం. అక్కడ ఉన్న డాక్టర్ ఒక ఇంజక్షన్ వేసి వెళ్లిపోయాడు. కొంతసేపటి తర్వాత నర్సులు వచ్చి మంచాలు ఖాళీ లేవు వెళ్లిపోండని రాత్రి 3 గంటలప్పుడు చెప్పారు. అక్కడ ఉన్న ఏఎస్ఐకి ఫిర్యాదు చేస్తుంటే మీరు పోలీసుల మీద ఎలా కంప్లయింట్ ఇస్తారని దబాయించారు. అధికారం చేతిలో ఉందని ఇంత దుర్మార్గంగా వ్యవహరిస్తారా?

– బండి లీలాప్రియ

సీఐ గన్ చూపించి బెదిరించాడు



పాలకు వెళ్లిన నా మనవరాలు ఇంకా రాకపోవడంతో బజారుకు వెళ్లగా అక్కడ ఏడుస్తూ కూర్చుని ఉంది. ఎస్సై రమేష్‌బాబు బూతులు తిట్టి కొట్టాడని చెప్పింది. మా స్థలంలోకి వచ్చి మా అమ్మాయిని ఎందుకు కొట్టారని ప్రశ్నిస్తే "ముసలిదానా నీకు ఇక్కడ ఏమి పని. నీకు భర్త లేడా రోడ్ల మీద తిరుగుతున్నావు" అని దుర్భాషలాడాడు. మా స్థలంలో రచ్చబండ కూల్చడానికి వీల్లేదని అడ్డుచెబుతుంటే సీఐ సోమశేఖర్ తుపాకీ చూపించి నన్ను నా మనవరాలిని బెదిరించాడు. మర్రిపూడి ఎస్సై బూటు కాలితో తన్నడంతో దెబ్బ తగిలి పడిపోయాను.

– భూమా కోటేశ్వరమ్మ

పోలీసులు ఈడ్చిపడేశారు



రచ్చబండ వివాదంలో ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు, మరో కేసులో ఉన్న వారు వెంటనే స్టేషన్‌కు రావాలని, లేదంటే ఎక్కువ కేసులు పెడతామని కొండపిఎస్సై ప్రేమ్ కుమార్ చెప్పారు. ఇప్పుడు రాలేము సార్ మా ఊరిలో ఒక ఆవిడ పాము కరిచి చనిపోయింది, తెల్లవారాక వస్తాం అనడంతో ఇప్పుడే రావాలని బలవంతంగా నన్ను జీపు ఎక్కించారు. పోలీసులు నోటికొచ్చినట్లు మాట్లాడారు. మీరు ఎన్ని కేసులైనా పెట్టుకోండి, నేను భయపడను అని గట్టిగా మాట్లాడటంతో కొంతసేపటికి నన్ను వదిలిపెట్టారు. రచ్చబండ కూల్చే సమయంలో అడ్డుగా వస్తున్నామని పోలీసులు పక్కకు ఈడ్చిపడేశారు.

– రమణమ్మ

డబ్బులిచ్చుకో.. మద్యం అమ్ముకో!

● ఎక్సైజ్ సిబ్బంది తీరుపై ఆరోపణలు



ఫొటోకు పేపర్ అడ్డుగా పెడుతున్న ఎక్సైజ్ సిబ్బంది

తర్లుపాడు: గ్రామాల్లో బెల్టు షాపులు ఏర్పాటు చేసి అందిన కాడికి దండుకుంటున్న మద్యం మాఫియాకు ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది అండగా నిలుస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గురువారం తర్లుపాడులో ఎక్సైజ్ అధికారులు వ్యవహరించిన తీరు చర్చనీయాంశమైంది. ఎక్సైజ్ సీఐ ఆధ్వర్యంలో తర్లుపాడు వచ్చిన సిబ్బంది ఓ కిరాణా షాపు వద్ద మద్యం తాగుతున్న వ్యక్తులపై బెదిరింపులకు దిగారు. ఆధార్ కార్డు చూపాలంటూ మభ్యపెట్టి వసూళ్లకు యత్నించారు. అటుగా వెళ్తున్న కొందరు విలేకరులు ఏం జరిగిందంటూ ఆరా తీయగా సీఐ, సిబ్బంది పొంతనలేని సమాధానాలు చెప్పారు. ఇదిలా ఉండగా ఎక్సైజ్ సిబ్బంది గ్రామాల్లో నెలవారీ మామూళ్లు వసూలు చేసి పైఅధికారులకు చేరవేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ దందాలో ఆ శాఖ డ్రైవర్ కీలకంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

ఆర్టీసీ డిపోలో మద్యపానం!



బస్టాండ్‌లో మద్యం గ్లాసులో నీళ్లు నింపుకొంటున్న వ్యక్తి

మార్కాపురం: మార్కాపురం ఆర్టీసీ డిపో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోంది. కొందరు మందుబాబులు బస్టాండ్‌లో నీళ్ల కుళాయిల వద్ద దర్జాగా మద్యం తాగుతున్నారు. గ్లాసుల్లో కుళాయి నీరు పట్టుకుని, అక్కడే మందు కలుపుకొని తాగేస్తుండటాన్ని చూసి ప్రయాణికులు నివ్వెరపోతున్నారు. దీనిపై మార్కాపురం ఆర్టీసీ డీఎం నరసింహులును వివరణ కోరగా.. మందు బాబుల ఆగడాలపై పోలీసులకు ఫిర్యాదు చేశామని, ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటామన్నారు.

విష సంస్కృతిని పెంచి పోషించొద్దు

- వైఎస్సార్ సీపీ శ్రేణులపై అక్రమ కేసుల నమోదు తగదు
- గొడవ వద్దని సర్ది చెప్పిన నాయకుడిపై కేసు పెట్టడం దారుణం
- వైఎస్సార్ సీపీ గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి కేపీ నాగార్జునరెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

గిద్దలూరు రూరల్(బేస్తవారిపేట): గిద్దలూరు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులను టార్గెట్ చేసి అక్రమ కేసులు పెట్టి అరాచక పాలన చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేపీ నాగార్జునరెడ్డి మండిపడ్డారు. గురువారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు దొడ్డంపల్లి పంచాయతీలో జరిగిన గొడవలో దెబ్బలు తిన్నవారు వైద్యశాలలో ఉండి కేసు పెడితే బెయిలబుల్ సెక్షన్లు, ఎటువంటి దెబ్బలు లేనివారు కేసు పెడితే నాన్‌బెయిలబుల్ సెక్షన్లు పెట్టడం దారుణమన్నారు. గ్రామాల్లో వివాదాలు జరిగేటప్పుడు సర్దిచెప్పేందుకు వెళ్లిన పెద్ద మనుసులపై కేసులు పెట్టిన ఘనత గిద్దలూరు పోలీసులకే దక్కిందన్నారు. 45 ఏళ్లుగా రాజకీయాలు చేస్తూ అందరికీ అనుకూలంగా ఉండే బొర్రా కృష్ణారెడ్డిని ఏ2గా చేర్చి రిమాండ్‌కు పంపడం దుర్మార్గమన్నారు. సహాయం చేయడానికి, సర్దిచెప్పడానికి గ్రామాల్లో పెద్దమనుషులు ఉండకూడదనే సంప్రదాయానికి నాందిపలకడం సమంజసం కాదన్నారు. గ్రామాల్లో ఇలాంటి విష సంస్కృతిని పెంచిపోషించకుండా ఎస్పీ, కలెక్టర్ చర్యలు తీసుకోవాలని కోరారు. వైఎస్సార్ సీపీ శ్రేణులకు పార్టీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కడప వంశీధరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నగర పార్టీ అధ్యక్షులు మానం బాలిరెడ్డి, గిద్దలూరు, రాచర్ల మండల అధ్యక్షులు బి.ఓబులరావు, యేలం మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య



రైలు పట్టాల పక్కన పడి ఉన్న మృతదేహం

కంభం: రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం అర్ధరాత్రి కంభంలో చోటుచేసుకుంది. వివరాలు.. మార్కాపురం మండలం దరిమడుగు గ్రామానికి చెందిన గుమ్మా సుబ్బారావు కంభం రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సంఘటనా స్థలం సమీపంలో అతని ద్విచక్రవాహనాన్ని గుర్తించారు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఆత్మహత్య చేసుకున్నట్లు అనుమానిస్తున్నారు.

బషీర్‌బాగ్ స్ఫూర్తితో మరో విద్యుత్ పోరాటం



మాట్లాడుతున్న గుజ్జుల ఈశ్వరయ్య


ఒంగోలు టౌన్: బషీర్‌బాగ్ అమరవీరుల స్ఫూర్తితో రాష్ట్రంలో మరో విద్యుత్ పోరాటానికి సిద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. విద్యుత్ సంస్కరణలను ఉపసంహరించుకోకుంటే ప్రజాగ్రహంలో కూటమి ప్రభుత్వం కొట్టుకొనిపోవడం ఖాయమని చెప్పారు. ప్రతిజ్ఞా దినాన్ని పురస్కరించుకొని 25 ఏళ్ల క్రితం చంద్రబాబు ప్రభుత్వం జరిపిన కాల్పుల్లో అమరులైన రామకృష్ణ, విష్ణువర్ధన్ రెడ్డి, బాలస్వామికి గురువారం ప్రకాశం భవన్ వద్ద ఘనంగా నివాళులర్పించారు. గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ.. 2000 సంవత్సరంలో విద్యుత్ ఉద్యమాన్ని అణచివేసేందుకు చంద్రబాబు ప్రభుత్వం కాల్పులు జరిపించిందని, వేలాది మంది కార్యకర్తలు బుల్లెట్లకు ఎదురు నిలిచి పోరాటం చేశారని గుర్తుచేశారు. ప్రతిపక్షంలో చంద్రబాబు, లోకేష్ స్మార్ట్ మీటర్లను పగులగొట్టాలని పిలుపునిచ్చి, గద్దెనెక్కిన తర్వాత స్మార్ట్ మీటర్లను బిగిస్తున్నారని, ట్రూఅప్ చార్జీల పేరుతో ప్రజల మీద మోయలేని భారం వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ సంస్కరణలపై కమ్యూనిస్టులు ఇప్పటికే ఉద్యమబాట పట్టారని, మరో పోరాటంతో చంద్రబాబు ప్రభుత్వం శంకరగిరి మాన్యాలు పట్టడం ఖాయమన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు డి.రమాదేవి, సీపీఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి డీవీఎన్ స్వామి, సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కే మాబు, రైతు నాయకులు చుండూరి రంగారావు, వామపక్ష నాయకులు ఆర్.మోహన్, కె.రమాదేవి, లలితకుమారి, బి.పద్మ, ఎల్.రాజశేఖర్, కొండారెడ్డి, బాలకోటయ్య, శ్రీరాం శ్రీనివాస్, ఎంఏసాలార్, ప్రకాశ్ రావు తదితరులు పాల్గొన్నారు.

చట్టం.. టీడీపీ నేతలకు చుట్టం!

- దాడికి పాల్పడిన టీడీపీ నాయకులు, వారి ముఠాపై బెయిలబుల్ సెక్షన్లు
- తీవ్రంగా గాయపడిన వైఎస్సార్ సీపీ సానుభూతిపరులపై నాన్ బెయిలబుల్ కేసులు
- కేసుల వివరాలు వెల్లడించడంలో గోప్యత.. పోలీసుల తీరుపై విస్మయం

గిద్దలూరు రూరల్(బేస్తవారిపేట): గిద్దలూరు మండలంలోని దొడ్డంపల్లెలో గణేశ్ నవరాత్రి మండపానికి విగ్రహాన్ని తరలించే క్రమంలో కవ్వింపు చర్యలకు పాల్పడి, కర్రలతో దాడికి తెగబడిన టీడీపీ నేతలపై పెట్టీ కేసులు నమోదు చేసి స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపడం తీవ్ర చర్చనీయాంశమైంది. టీడీపీ మూక దాడిలో గాయపడిన వైఎస్సార్ సీపీ సానుభూతిపరులపై ఏకంగా నాన్ బెయిలబుల్ సెక్షన్ల కింద పోలీసులు కేసులు నమోదు చేశారు. టీడీపీ నాయకులు ముందస్తు పథకం ప్రకారం గణేశుడి బొమ్మ తరలించే ట్రాక్టర్‌లో కర్రలు సిద్ధం చేసుకుని, మార్గమధ్యంలో బయటి వ్యక్తులను ఎక్కించుకుని గ్రామంలోకి వచ్చారు. టపాసులు కాల్చి వైఎస్సార్ సీపీ సానుభూతిపరుడైన రమణారెడ్డిపై వేశారు. ఎందుకు ఇలా చేస్తున్నారని ఆయన ప్రశ్నించగానే ట్రాక్టర్‌లో ఉన్న కర్రలు తీసుకుని మూకుమ్మడిగా దాడిచేశారు. అడ్డుకోబోయిన బంధువులను విచక్షణా రహితంగా కొట్టారు. ఈ ఘటనలో బొర్రా రమణారెడ్డి, నారాయణరెడ్డి, సుధాకర్‌రెడ్డికి తల పగిలి తీవ్ర గాయాలయ్యాయి. రెచ్చగొట్టి ఉద్దేశపూర్వకంగా దాడిచేసిన టీడీపీ వర్గీయులపై బెయిలబుల్ సెక్షన్‌లు, తీవ్రంగా గాయపడిన వైఎస్సార్ సీపీ వర్గీయులు 11 మందిపై నాన్‌బెయిలబుల్ సెక్షన్లు పెట్టడం టీడీపీ నేతల కుట్రను తేటతెల్లం చేస్తోంది. గొడవ జరిగే సమయంలో వైఎస్సార్ సీపీ నాయకుడు బొర్రా వెంకట కృష్ణారెడ్డి అక్కడ లేరు. చివరలో గాయపడినవారిని 108లో ఎక్కించే సమయంలో సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఆయనను ఏ–2గా పేర్కొంటూ నాన్‌బెయిలబుల్ కేసు నమోదు చేయడం గమనార్హం. ఈ సంఘటనలో 22 మందిపై కేసు నమోదు చేసినట్లు చెబుతున్న పోలీసులు పూర్తి వివరాలు వెల్లడించకుండా గోప్యత పాటిస్తున్నారు.

ట్రాక్టర్ పంచాయతీది.. పెత్తనం టీడీపీ నేతది!



టీడీపీ నేత ఇంటి ఆవరణలో ఉన్న ట్రాక్టర్

అర్ధవీడు: ఇళ్లలో చెత్త సేకరించి డంపింగ్ యార్డుకు తరలించేందుకుగాను పంచాయతీకి ప్రభుత్వం కేటాయించిన ట్రాక్టర్‌ను ఆ గ్రామ టీడీపీ నేత బాడుగలకు తిప్పడమే కాకుండా సొంత పనులకు వాడుకోవడం చర్చనీయాంశమైంది. వివరాల్లోకి వెళ్తే.. అర్ధవీడు మండలం పాపినేనిపల్లి గ్రామ సచివాలయానికి ఐదు నెలల క్రితం ట్రాక్టర్ కేటాయించారు. అయితే చెత్త సేకరించేందుకు అవసరమైన ట్రాలీని ఇంత వరకు ఇవ్వలేదు. ఇదే అదనుగా భావించిన గ్రామ టీడీపీ నాయకుడు, ఉప సర్పంచ్ భర్త పంచాయతీకి చెందిన ట్రాక్టర్‌ను తన స్వాధీనంలోకి తీసుకున్నాడు. రాళ్లు, చెరువు మన్ను తరలించడంతోపాటు సేద్యపు పనులకు ట్రాక్టర్‌ను వినియోగిస్తూ బాడుగల సొమ్మును తన జేబులో వేసుకుంటున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

రెండుసార్లు బోల్తా..

మూడు నెలల క్రితం పంచాయతీ ట్రాక్టర్ పాపినేనిపల్లి వద్ద చీమలేరులో బోల్తా పడింది. డ్రైవర్ ఏలియాకు కాలు విరగగా నర్సరావుపేటలోని ఓ వైద్యశాలలో 20 రోజులపాటు చికిత్స పొంది ఇంటికి చేరుకున్నాడు. మరి ఆ కేసు ఎవరిపై పెట్టారో ఏమైందో ఎవరికీ తెలియదు. మళ్లీ నెల రోజుల క్రితం బాడుగకు వెళ్లిన ట్రాక్టరు అదే చీమలేరు బ్రిడ్జిపై పల్టీ కొట్టగా డ్రైవర్ స్వల్ప గాయాలతో భయటపడ్డాడు. ఇంజనాయిల్ మొత్తం లీకై ట్రాక్టర్ దెబ్బతిన్నది. గ్రామ సచివాలయం వద్ద ఉండాల్సిన ట్రాక్టర్ గురువారం కూడా ఉప సర్పంచ్ ఇంటి ఆవరణలో నిలిపి ఉంది. గ్రామ కార్యదర్శి వద్ద ఉండాల్సిన పర్మిట్ రికార్డు ఉప సర్పంచికి ఎవరు ఇచ్చారు? కొత్త ట్రాక్టరును ఎవరి అనుమతితో బాడుగకు పంపిస్తున్నారు. బాడుగల ద్వారా వచ్చిన సొమ్ము ఏం చేస్తున్నారు? ప్రమాదాలకు గురైన ట్రాక్టర్‌కు మరమ్మతుల ఖర్చు ఎవరు భరించాలి? అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సి ఉంది.